క్లుప్తంగా

నేటి నుంచి డిగ్రీ మూడవ విడత అడ్మిషన్లు

తిరుపతి సిటీ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ మూడవ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు ఉన్నత విద్యామండలి ఆదివారం సీట్లు కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసింది. సీట్లు పొందిన విద్యార్థులు తమకు కేటాయించిన కళాశాలలో 25వ తేదీలోపు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం..

అలాగే మహిళా వర్సిటీ, ఎస్వీయూ పరిధిలో పీజీ సెట్-2024 రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు సోమవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు వెబ్ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుంది. 26న ఆప్షన్ల మార్పుకు వెసులుబాటు కల్పించిన ఉన్నత విద్యామండలి, 28న సీట్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయనున్నారు. సీట్లు సాధించిన విద్యార్థులు కళాశాలల్లో ఈనెల 30వ తేదీలోపు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

ఉద్యోగాలు భర్తీ చేస్తాం

తిరుపతి(అలిపిరి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటికీ కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపుతుందని.. 'ఇది మంచి ప్రభుత్వం' అని ప్రజలే అంటున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్టీవీ నగర్‌లోని శ్రీరాముడి భజన మందిరం వద్ద ప్రజావేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల అమల్లో భాగంగా ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడం మొదలు పెట్టిందన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సీఎంఎం కృష్ణవేణి, మాజీ ఎంపీ పనబాక లక్ష్మి, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, పులిగోరు మురళి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

భాకరాపేట : కూటమి ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేసిందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిఅన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎర్రావారిపాళెం మండలం ఉస్తికాయలపెంట పంచాయతీ, చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె పంచాయతీ కేంద్రాల్లో సభలు నిర్వహించారు. ఈ సభల్లో ఆయన మాట్లాడుతూ వంద రోజుల పాలనలో సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక పార్టీ నేతలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


చీర్ల కిరణ్ ప్యానల్‌కు మద్దతు



చీర్ల కిరణ్ ప్యానల్‌కు కలిసి మద్దతు తెలుపుతున్న సమీర్

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు ఎన్నికల్లో చీర్ల కిరణ్ ప్యానల్‌లోని గుంటూరు రేఖ, వంకీపురం పవన్, సునీల్ కుమార్ యాదవ్, మణికంఠకు టీటీడీలోని ఉద్యోగులంతా ఓట్లు వేసి గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసి యేషన్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సమీర్ కోరారు. ఆదివారం ఆయన తిరుపతిలోని చీర్ల కిరణ్ ప్యానల్ అభ్యర్థులను కలిశారు. కరోనా సమయంలో.. సీపీఎస్ రద్దు కోసం.. ఉద్యోగులకు సేవలందించేందుకు ముందుండే చీర్ల కిరణ్ ప్యానల్‌ను గెలిపించుకోవాలని కోరారు. సీపీఎస్ చిత్తూరు జిల్లా కార్యవర్గ సభ్యులు తెలిపారు.

శ్రీ గంధం నరికివేత



శ్రీ గంధం చెట్లను నరికివేసిన దృశ్యం

భాకరాపేట: వ్యవసాయ పొలంలో పెంచుకుంటున్న శ్రీ గంధం చెట్లను నరికివేసినట్లు రైతు గుండాల వెంకట్రమణ తిరుపతి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రైతు కథనం.. చిన్నగొట్టిగల్లు మండలం, తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీ, కమ్మపల్లె సమీపంలోని మామిడి తోటలో ఉన్న శ్రీగంధం వనంలో స్మగ్లర్లు నాలుగు చెట్లు నరికివేశారు. ఈమేరకు భాకరాపేట పోలీసులు పులిచెర్ల మండలం మిట్టమీదరాసిపల్లెకు చెందిన ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో స్మగ్లర్లు నాలుగు కిలోల శ్రీగంధంను వ్యాపారికి విక్రయించినట్లు తేలింది.

ఆలయ రోడ్డు ధ్వంసం

ఏర్పేడు: మండలంలోని రావిళ్లవారికండ్రిగ ఎరిక లింగేశ్వర స్వామి ఆలయ రోడ్డును స్థానిక టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. ఆలయానికి 22.44 ఎకరాల భూములు ఉన్నాయి. గత కొంతకాలంగా భూవివాదం కోర్టులో కేసు నడుస్తోంది. మూడేళ్ల క్రితం రోడ్డు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి భక్తులు ఈదారిలోనే ఆలయానికి వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం ఆలయానికి వేసిన రోడ్డును జేసీబీతో తవ్వేశారు. గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీని అడ్డుకుని తవ్వకుండా అక్కడి నుంచి పంపారు.

తిరుపతి ఆకాశవాణి కేంద్రం భవనం , లెటర్ రిక్వెస్ట్ కోసం శ్రోతల నుంచి వచ్చిన పోస్ట్‌కార్డులు





అరచేతిలో చరవాణి..

వినిపిస్తోంది ఆకాశవాణి

గతంలతో సామాన్యుడి నుంచి ధనంతుడి వరకూ ప్రతి ఇంటా వినిపించేది ఆకాశవాణి ప్రసార కార్యక్రమాలు. ప్రసార సాధనాలు, సోషల్ మీడియా లేని కాలంలో ప్రపంచంలోని 90 శాతం ప్రజానికానికి మేఘసందేశం అందించిన ఓ మధుర జ్ఞాపకం ఆకాశవాణి.. భక్తిగీతాలు, కళాకారుల ఏకపాత్రాభినయం, హరికథలు, నాటికలు, అలనాటి మధుర గీతాలు ఇలా ఎన్నో ప్రాచీన కార్యక్రమాలకు తోడు యువతను ఆకట్టుకునేలా ఎన్నో కార్యక్రమాలు ప్రసారం చేసింది. కాలానుగుణంగా వచ్చిన మార్పుల ఆధారంగా రేడియోలో ప్రసారాలు సైతం అప్‌డేట్ అయ్యాయి.

- దేశంలోనే అగ్రగామి ప్రసార కేంద్రంగా తిరుపతి ఆకాశవాణి కేంద్రం
- రేడియో సెట్ల స్థానంలో ఆన్‌లైన్ యాప్ హల్‌చల్
- న్యూస్ ఆన్ ఏఐఆర్ యాప్‌తో యువతను ఆకట్టుకుంటున్న ఆకాశవాణి
- లెటర్ రిక్వెస్ట్, వాట్సాప్ రిక్వెస్ట్, ఫోన్ ఇన్ కార్యక్రమాలు
- ప్రాయోజిత కార్యక్రమాలు, టాలెంట్ సెర్చ్, ఉద్యోగ సమాచారం ప్రసారం
- ప్రత్యేక కార్యక్రమాలతో విద్యార్థుల ప్రతిభను ప్రపంచానికి చాటుతున్న ప్రసారభారతి

తిరుపతి సిటీ: ఆధునిక సమాజంలోనూ రేడియో సెట్లు మరుగునపడినా తన ఉనికిని నిలబెట్టుకుంటోంది ఆకాశవాణి. సరికొత్త ఆన్‌లైన్ యాప్ ద్వారా యువ తను ఆకట్టుకుంటూ మేఘసందేశం ఇస్తోంది. ఇందులో భాగంగా న్యూస్ ఆన్ ఏఐఆర్ యాప్‌ను తయారు చేసి ప్రపంచంలోని ఏ ప్రదేశంలో నైనా ఆకాశవాణి ప్రసారాలను వినే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం 80 శాతం ప్రజలు తమ మొబైల్స్‌లోనే ఆకాశవాణి యాప్‌ను వినియోగిస్తున్నారు.

రెండు ఫ్రీక్వెన్సీ మోడ్‌లలో ప్రసారాలు

తిరుపతి అన్నమయ్య సర్కిల్ వద్ద 1991లో తిరుపతి ఆకాశవాణి కేంద్రాన్ని ప్రారంభించారు. 25 కి.మీ రేంజ్ కవరేజీతో లోకల్ ట్రాన్స్ మిషన్‌తో ప్రారంభమై, 2000 సంవత్సరంలో తిరుమల నారాయణగిరిలో 125 కి.మీ రేంజ్ ఫ్రీక్వెన్సీతో మరో కేంద్రాన్ని ప్రారంభించారు. తిరుపతి 103.2 ఫ్రీక్వెన్సీలోనూ, తిరుమల 107.5 ఫ్రీక్వెన్సీలో ప్రస్తుతం ప్రసారాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి.



శ్రోతలు పంపిన రిక్వెస్ట్ లెటర్లను చదివి వారితో మాట్లాడుతున్న ఉద్యోగి శ్రీనివాస్

తిరుపతి, తిరుమల కేంద్రాలకు ప్రత్యేక గుర్తింపు

దేశంలోనే అన్ని ప్రసార కేంద్రాల్లో తిరుపతికి ప్రత్యేక గుర్తింపుతో పాటు అగ్రగామి ఆకాశవాణి కేంద్రంగా వెలుగొందుతోంది. 1995 నుంచి 2000 వరకు అలాగే 2016 నుంచి 2021వ సంవత్సరం వరకు సుప్రభాతం లైవ్ రిలే ఇవ్వడంతో తిరుపతి, తిరుమల ఆకాశవాణి కేంద్రాలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. అప్పటి నుంచి యూనివర్సిటీలు, సైన్స్ సెంటర్, వికసిత్ భారత్ ప్రోగ్రాంలు, పాఠశాల పిల్లల కార్యక్రమాలు, పేరొందిన సంగీత, కళాకారుల ప్రోగ్రాంలను క్రమం తప్పకుండా అందిస్తోంది. దేశ, విదేశాలలో ప్రఖ్యాతి గాంచిన సినీగాయకులు, ఆధ్యాత్మిక మేధావులు ఈ కేంద్రం ద్వారా తమ గానామృతాన్ని ప్రజలకు వినిపించారు. ఈ కేంద్రంలో సుమారు 20 వేలకు పైగా సినిమా పాటలు, వేల సంఖ్యలో ఏకపాత్రాభినయాలు, నాటికల పాత సీడీ రీల్స్, ఫిల్మ్ రీల్స్‌ను ప్రత్యేక గదిలో భద్రపరుస్తున్నారు.

పోస్ట్ కార్డుల సందేశాల కోసం రిక్వెస్ట్..

పోస్ట్‌కార్డు మరుపురాని ఓ జ్ఞాపకం. గతంలో ఏ సందేశమైనా పోస్ట్‌కార్డు ద్వారానే ప్రజలు చేరవేసుకునే వారు. ప్రస్తుతం పోస్టుకార్డు కొనేవారు కరువయ్యారు. కానీ తిరుపతి ఆకాశవాణి కేంద్రానికి పోస్టుకార్డుల ద్వారా యువత తమ సందేశాలను పెద్దఎత్తున పంపుతున్నారు. అలాగే ప్రతి ఆదివారం ఉదయం 8.35 నుంచి 9 గంటల వారకు బాలానందం, టాలెంట్ సర్చ్ పేరుతో పాఠశాలలోనూ, కళాశాలల్లోనూ ప్రతిభగల విద్యార్థులచే గీతాలు, పద్యాలు, నాటికలు, సామాజిక అంశాలపై ప్రోగ్రాంలు చేస్తున్నారు. యువవాణి పేరుతో ఉద్యోగ సమాచారం ప్రసారం చేస్తున్నారు.

ప్రతిభావంతులకు చక్కని వేదిక



ప్రతిభను ప్రోత్సహించడం, విద్యార్థులలో అంతర్గతంగా ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రపంచానికి పరిచయం చేయాలన్న ఉద్దేశంతో ఆకాశవాణి ఎన్నో రకాల కార్యక్రమాలను చేపడుతోంది. ఆధ్యాత్మిక నగరంలో నెలకొల్పబడిన తిరుపతి ఆకాశవాణి కేంద్రానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. శ్రీవారి ప్రసారాలను రిలే ఇచ్చిన చరిత్ర ఆకాశవాణికి ఉంది. ప్రసారాల కోసం అన్ని అర్హతలు ఉన్న వారు పోస్ట్ కార్డు ద్వారా గానీ నేరుగా గానీ తిరుపతి ఆకాశవాణి కేంద్రం, అన్నమయ్య సర్కిల్, ఆర్డీఓ కార్యాలయం పక్కన ఉన్న కార్యాలయంలో లేదా వాట్సాప్ మెసేజీల కోసం 8772246605 నంబర్‌లో సంప్రదించవచ్చు.

– ఎం.సుధాకర్ మోహన్, అసిస్టెంట్ డైరెక్టర్, తిరుపతి ఆకాశవాణి కేంద్రం









ఎస్వీ జూపార్క్ క్యూరేటర్‌తో ప్రత్యేక లైవ్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్ మోహన్, విద్యార్థులకు ప్రత్యేక క్విజ్ కార్యక్రమం, కంట్రోల్ రూమ్ నుంచి సిగ్నల్స్ పంపుతున్న సిబ్బంది, రికార్డింగ్ స్టూడియోలో ప్రసార విశేషాలను చదువుతన్న శైలజ

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

తిరుపతి ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. తిరుపతిలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఏపీటీఎఫ్–1938 జిల్లా విద్యా వైజ్ఞానిక సదుస్సుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డీఈఓ డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ మెరుగైన విద్యావ్యవస్థ బలోపేతానికి ఇలాంటి విద్యా వైజ్ఞానిక సదస్సులు దోహదపడతాయన్నారు. రాష్ట్ర అదనపు కార్యదర్శి చెంగల్రాయ మండడి మాట్లాడుతూ 117 జీఓ రద్దు చేయడానికి ప్రభుత్వం త్వరలో చొరవ చూపాలన్నారు. సమావేశంలో తిరుపతి, పుత్తూరు డీవైఈఓలు బాలాజీ, ప్రభాకర్‌రాజు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవార్డులు

తిరుపతి సిటీ: తిరుపతిలోని సాంస్కృతి విద్యాపీఠం ఆడిటోరియంలో ఆదివారం అప్పుస్మా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేశారు. జిల్లాలో 600 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి అవార్డులు అందించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సంస్కృతి సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య కృష్ణమూర్తి, తిరుపతి డీఈఓ శేఖర్, డిప్యూటీ డీఈఓలు బాలాజీ, ప్రభాకర్‌రాజు, అప్పుస్మా రాయలసీమ జోన్ అధ్యక్షులు ఎస్.విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలు ప్రారంభం



రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

తిరుపతి ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–14 రాష్ట్రస్థాయి జూడో పోటీలు ఆదివారం తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభమయ్యాయి. రాష్ట్రస్థాయి జూడో పోటీలను డీఈఓ డాక్టర్ శేఖర్, డీఎస్‌డీఓ సయ్యద్ సాహెబ్ ప్రారంభించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి బాలబాలికలు హాజరయ్యారు. బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. సోమవారం నాకౌట్ నిర్వహించి అందులో విజయం సాధించిన క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లను అందజేయనున్నారు. కార్యక్రమంలో తిరుపతి, పుత్తూరు డీవైఈఓలు బాలాజీ, ప్రభాకర్‌రాజు, ఎస్‌జీఎఫ్ అండర్–19 కార్యదర్శి జయరామయ్య, అండర్–14, 17 కార్యదర్శులు బాబు, జె.వసంతవాణి, ఎం.వసంత, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ: మన హాస్టల్, ఇంటితో పాటు, గ్రామాన్ని, మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని అంటు వ్యాధులు సోకకుండా చూసుకోవాలని తిరుపతి జిల్లా బీసీ సంక్షేమాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగలోని బీసీ హాస్టల్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. వార్డన్ రామయ్య, విద్యార్థులతో కలసి హాస్టల్ పరిసరాలను శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని చేపడుతున్నారని తెలిపారు. ప్రతిరోజూ హాస్టల్‌లోని విద్యార్థులు ఒక గంటపాటు పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. మొక్కలను నాటి పర్యావరణ పరిపరక్షణ చేపట్టాలని తెలిపారు. సిబ్బంది హైమవతి, చెంగయ్య, పాల్గొన్నారు.

వేడుకగా శ్రీవారాహి మహా రథయాత్ర



రథయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: లోకకల్యాణార్థం, ప్రజా సుభిక్షతను కాంక్షిస్తూ శ్రీఆదివారాహి శక్తి టెంపుల్ ట్రస్ట్, త్రిశక్తి వారాహిపీఠం సంయుక్త ఆధ్వర్యంలో తలపెట్టిన శ్రీవారాహి మహారథయాత్ర ఆదివారం తిరుపతిలో అత్యంత వేడుకగా నిర్వహించారు. తొలుత జీవకోనలోని శ్రీజీవలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీవారాహి దేవి కొలువైన రథానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పూజలు చేసి రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి మాట్లాడుతూ సమాజహితం, ప్రజల సుభిక్షతను కాంక్షిస్తూ శ్రీవారాహి మహా రథయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. శ్రీవారాహి దేవి కృపాకటాక్షాలు ప్రజలపై మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం జీవకోన, రాజీవ్‌గాంధీ కాలనీ, సత్యనారాయణపురం, గోవిందనగర్, లీలామహల్ సర్కిల్, పాత మున్సిపల్ కార్యాలయం, గిరిపురం సర్కిల్, జ్యోతి థియేటర్, ఎన్టీఆర్ సర్కిల్, కృష్ణాపురం ఠాణా, నాలుగు కాళ్ల మండపం మీదుగా ఇందిరామైదానం వరకు శ్రీవారాహి యాత్ర సాగింది. సాయంత్రం 7 గంటలకు ఇందిరామైదానంలో శ్రీఆదివారాహి శక్తిపీఠం మహారుద్రస్వామి, త్రిశక్తి వారాహి శక్తిపీఠం యాగరుషి వారాహి స్వామి ఆధ్వర్యంలో ఉచితంగా శ్రీవారాహి మహాయాగం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు మబ్బు దేవనారాయణరెడ్డి, కార్పొరేటర్ అన్నా అనిత, కృష్ణయాదవ్, బాల, భాను చౌదరి, గోపి రాయల్, వెంకటేష్, భక్తులు పాల్గొన్నారు.

శిల్పారామంలో మెష్ ఫ్యాషన్ షో

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ఈనెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సంప్రదాయ వస్త్రధారణపై నేటి యువతరానికి అవగాహన కోసం విన్నర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనర్, శిల్పారామం సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టింది. ఇందులో పెద్దఎత్తున యువతులు పాల్గొని వారే స్వయంగా డిజైన్ చేసిన వస్త్రధారులను ప్రదర్శించారు. నేటి ఆధునిక యుగంలో పూర్తిస్థాయిలో ఫ్యాషన్‌పై మక్కువ చూపి సంప్రదాయాన్ని మర్చిపోతున్న క్రమంలో యువతకు పాత సంప్రదాయాలను గుర్తు చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టామని శిల్పారామం ఏఓ ఖాదర్‌వలీ తెలిపారు.



మాట్లాడుతున్న టూరిజం జిల్లా అధికారి రూపేంద్ర నాథ్ రెడ్డి, అధికారులు

ముఖ్య అతిథిగా జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేందర్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సందీప్ చౌదరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



శిల్పారామంలో మేష్ ఫ్యాషన్ ఫెస్ట్‌లో 2024 సంప్రదాయ దుస్తుల్లో మోడల్స్

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రాజు



తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్లు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రాజు, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్లు, కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కండలేరులో 17.644 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 17.644 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,550 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. అలాగే సత్యసాయి గంగ కాలువకు 1,170, పిన్నేరు కాలువకు 40, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కాలినడకన మూడోసారి శబరిమలైకు..



ఆత్మస్థైర్యం..మనోబలం.. ఆత్మవిశ్వాసం ముందు అంగవైకల్యం, అతని లక్ష్యం చిన్నపోయింది.. నెల్లూరులోని కుక్కలగుంటలో నివాసం ఉంటున్న ఆత్రపాక సురేష్ 47 బంగారు పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నాలుగేళ్ల కిందట ఓ రోడ్డు ప్రమాదంలో కుడికాలు సగానికి పోయింది. అంతకుముందు సహచర మిత్రుల సహకారంతో ఏడాదికి ఒకసారి శబరిమల యాత్రకు వెళ్లేవారు.. ఇప్పుడు తనకు కాలు లేకపోవడంతో ఎలా అయినా కాలినడకన శబరిమలకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటానని మొక్కుకున్నాడు. గత నాలుగేళ్లుగా కాలు లేకపోయినా కూడా ఒంటికాలితో నెల్లూరు నుంచి తిరుపతి మీదుగా కాణిపాకం చిత్తూరు సేలం భవానీ, పంబ మీదుగా శబరిమలైకు చేరుకుంటారు. నెల్లూరు నుంచి శబరిమలైకు చేరడానికి మూడు నెలల సమయం పడుతుందని, ఈనెల సెప్టెంబర్ 4న నెల్లూరులో ప్రారంభమైన ఈ కాలినడకన యాత్ర రోజుకు 10 కిలోమీటర్ల చొప్పున 980 కిలోమీటర్లు ఒంటికాలితో నడిచి శబరిమలైకి చేరుకుంటానని సురేష్ తెలిపారు. ఆ సుబ్రమణ్య స్వామి దయతోనే తాను ఈ యాత్ర చేస్తున్నట్లు చెప్పాడు. ఆదివారం ఆయన రేణిగుంట–తిరుపతి మార్గమధ్యన వెళ్తుండగా సాక్షి కెమెరా బంధించిన దృశ్యాలు

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

జేసీబీలతో ఉపాధిహామీ పనులు

- తవ్విన గుంతలకు కూలీలతో సోకులు
- లక్షలు కాజేస్తున్న టీడీపీ నాయకులు
- నేతల సేవలో ఉపాధిహామీ క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది
- పని కల్పించాలంటున్న నిరుపేద కూలీలు



మద్దినాయనపల్లి నాయనిచెరువులో జేసీబీతో జరుగుతున్న ఉపాధిహామి పనులు

తిరుపతి టాస్క్‌ఫోర్స్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలు శాఖల్లోని అధికారుల్లో నిర్లక్ష్యం పెరిగిపోయింది. పాకాల మండలంలో దాదాపు అన్ని పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామి పనులు ప్రారంభమయ్యాయి. టీడీపీ నాయకులు అక్రమంగా సులువుగా డబ్బు సంపాదించేందుకు ఉపాధిహామి పనులు అవకాశంగా మారాయి. తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు నాయకులు అడ్డగోలుగా జేసీబీలతో గుంతలు తవ్వి, ఆపై కూలీలతో తవ్విన గుంతలకు జేసీబీతో తవ్వినట్లు ఆనవాళ్లు కనిపించకుండా సోకులు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన ఫీల్డ్‌అసిస్టెంట్లు గుంతలకు సోకులు పూర్తయ్యే వరకు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఒక్కో పంచాయతీలో పదుల సంఖ్యలో లక్షల విలువ చేసే ఉపాధిహామీ పనులను సెలవు దినాల్లో జేసీబీలతో పని చేస్తున్నా, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా అక్రమ మార్గంలో ఉపాధిహామి పనులు చేస్తున్నారు. వేలకువేలు జీతాలు తీసుకుంటూ, అధికార పార్టీ నాయకుల అండదండలతో అధికారులు పూర్తిగా పనులు మానేసి నాయకుల సేవలో తరిస్తున్నారరని నిజమైన కూలీలు ఆవేదన చెందుతున్నారు. దీంతో అసలైన కూలీలకు చేసుకుని పని దొరకడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోజూవారి కూలీలకు పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలని పలువురు కూలీలు కోరుతున్నారు.





పాకాల చెరువులో జేసీబీతో చేసిన ఆనవాళ్లు, ఓబుల శెట్టివారిపల్లి దిగవ చెరువులో జేసీబీతో పనులు చేస్తున్న దృశ్యం